

# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

మన దునియా

సంప్రదించు ఆలస్యం...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 342 | ఆగస్టు 10 సోమవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# మంథని ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా ఏదీ..?




- అనుమతి లేని వైద్యులతో వైద్యం చేస్తున్నారంటూ ఆరోపణలు..!
- బస్టాండ్ సమీపంలోని ఆసుపత్రిపై సమగ్ర విచారణకు డిమాండ్
- వైద్యుల అర్హతలు.. అనుమతులు.. చికిత్సలపై తనిఖీలు ఎప్పుడు..?
- ప్రజల ప్రాణాలతో చెలగాటం చేస్తున్నారనే ఆరోపణలు..!

## ప్రజల ఆరోగ్యం కాపాడటమే లక్ష్యమైతే.. వెంటనే చర్యలు తీసుకోండి!

**మన దునియా, పెద్దపల్లి జిల్లా, ఆగస్టు 09**

మంథని పట్టణంలో కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వహణపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బస్టాండ్ సమీపంలో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యుల అర్హతలు, ఆసుపత్రి నిర్వహణకు ఉన్న అనుమతులు,

(మిగతా 2వ పేజీలో..)

# ఇవాళ పెద్ది సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లనున్న కేసీఆర్

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09**

తెలంగాణ:పార్టీ ఆవిర్భావం నుంచి తనకు అత్యంత ఆప్తుడిగా ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, తీవ్ర విషాదంలో ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు కేసీఆర్ ఆదివారం పెద్ది స్వగ్రామమైన వరంగల్ జిల్లా నల్లబెల్లికి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో కేసీఆర్ కుటుంబ సభ్యులను ఓదార్చి, కష్టకాలంలో పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇవ్వనున్నారు. ఇప్పటికే పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కేసీఆర్ ప్రకటించారు.



# మహిళలకు ఉచితంగా చీరలు.. ఈసారి కొత్త డిజైన్‌లలో

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09**



తెలంగాణ:మహిళా సంఘాలకు ప్రభుత్వం పంపిణీ చేయనున్న చీరల ఉత్పత్తి వేగంగా కొనసాగుతోంది. మే నెలలో 4.62 కోట్ల మీటర్ల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వగా, ఇప్పటివరకు 1.74 కోట్ల మీటర్ల వస్త్రం ఉత్పత్తి పూర్తయింది. ఈసారి నీలం

(మిగతా 2వ పేజీలో..)

# స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది: ప్రధాని మోదీ

- క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య పోరాటానికి కొత్త ఊపునిచ్చిందన్న ప్రధాని
- ఉద్యమకారుల ధైర్యసాహసాలు, త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య
- 'డూ ఆర్ డై' సంకల్పాన్ని దేశప్రజల్లో నింపిందని గుర్తు చేసుకున్న అమిత్ షా
- ఉద్యమకారులకు నివాళులర్పించిన ప్రధాని, కేంద్ర హోంమంత్రి, యూపీ సీఎం



చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం స్వాతంత్ర్య సంగ్రామానికి కొత్త శక్తిని అందించిందని

(మిగతా 2వ పేజీలో..)

# ఇవాళ జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని: మమతా బెనర్జీ

- పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ కారుపై రాళ్ల దాడి
- మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లగా ఘటన
- పోలీసుల సమక్షంలోనే దాడి జరిగిందని మమత ఆరోపణ
- దాడిని ఖండించిన బీజేపీ, తమకు సంబంధం లేదని వెల్లడి
- కస్టడీ మరణాన్ని రాజకీయం చేస్తున్నారంటూ మమతపై సువేందు అధికారి విమర్శ

పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రయాణిస్తున్న కారుపై నిరసనకారులు దాడికి పాల్పడ్డారు. కోల్‌కతా సమీపంలోని ఉత్తర 24 పరగణాల జిల్లా హాలిసహర్‌లో ఈ ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం


## మహిళలకు ఉచితంగా చీరలు.. ఈసారి కొత్త డిజైన్‌లలో

(మొదటి పేజీ తరువాయి)



రంగుకు బదులుగా చిలకపచ్చ రంగు చీరలను పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వం రూ. 450 కోట్లు కేటాయించగా, రూ. 142 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. సెప్టెంబరు 20లోగా ఉత్పత్తి పూర్తి చేసి అక్టోబరులో పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఉత్పత్తి ద్వారా రాజన్న సిరిసిల్ల పవర్‌లూమ్, మ్యాక్స్ సంఘాలకు పని లభించడంతో నేతన్నల్లో ఆశలు పెరిగాయి.

## నా రాజీనామాకు కారణమదే: తొలిసారి స్పందించిన ధర్మేంద్ర ప్రధాన్

- రాజీనామాపై మౌనం వీడిన ధర్మేంద్ర ప్రధాన్
- జెన్–జీ విద్యార్థులను కొందరు తప్పుదోవ పట్టించారని ఆరోపణ
- తనపై నిరసనల వెనుక నవీన్ పట్నాయక్ ఉన్నారని విమర్శలు
- ప్రధాన్ పై విమర్శలకు పోలీసుల లాఠీఛార్జే కారణమన్న బీజేడీ
- ముందస్తు చర్యగా 30 మంది బీజేడీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నీట్ పేపర్ లీక్ వివాదంపై విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ సీనియర్ నేత, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ తొలిసారిగా ఆ అంశంపై స్పందించారు. విద్యార్థులను (జెన్–జీ) తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరిగాయని, అందుకే తాను రాజీనామా చేశానని వెల్లడించారు. జులై 25న రాజీనామా చేసిన సరిగ్గా రెండు వారాల తర్వాత, భువనేశ్వర్‌లోని జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "జెన్–జీ మన పిల్లలు. కొంతమంది వారిని తప్పుదోవ పట్టించాలని చూశారు. నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు లేవు. పదవి నాకు ముఖ్యం కాదు. అందుకే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి నా రాజీనామాను ప్రతిపాదించాను" అని ప్రధాన్ వివరించారు. భారతదేశంలో ప్రతి ఏటా రెండు కోట్ల మంది పిల్లలు పుడుతున్నారని, గడిచిన పదేళ్లలో 20 కోట్ల మంది జన్మించారని, వారి ఆకాంక్షలే దేశాన్ని 'విశ్వగురువు'గా నిలబెడతాయని ఆయన అన్నారు. మరోవైపు తన ఒడిశా పర్యటన సందర్భంగా బీజేడీ కార్యకర్తలు చేపట్టిన నిరసనలపై కూడా ప్రధాన్ తీవ్రంగా స్పందించారు. ఎయిర్‌పోర్ట్ వద్ద 'ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్' అంటూ బీజేడీ యువజన, విద్యార్థి విభాగం కార్యకర్తలు చేసిన నిరసనలను ప్రస్తావిస్తూ మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌పై విమర్శలు గుప్పించారు. "నేనొక రైతు కొడుకుని. మీరు నన్ను వెనక్కి పొమ్మన్నా, మళ్లీ వస్తాను. నవీన్ బాబు నన్ను ఒడిశా ప్రజలకు అవమానకరమని, చెడ్డవాడినని అంటున్నారు. ఒడిశా ప్రజలు సిగ్గుతో తలదించుకునే పని నేనెప్పుడైనా చేశానా?" అని సభను ప్రశ్నించగా, 'లేదు' అంటూ పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసే పని తాను ఎప్పటికీ చేయనని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన్ ఈ వ్యాఖ్యలు చేసిన వేదికపై బీజేడీ ఎమ్మెల్యే ప్రసన్న ఆచార్య కూడా ఉన్నారు. బీజేడీ నిరసనల నేపథ్యంలో తాను రావాలా? వద్దా? అని ప్రసన్న ఆచార్యను సంప్రదించానని, ఆయన రమ్మని చెప్పడంతోనే వచ్చానని ప్రధాన్ పేర్కొన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ విమర్శలపై బీజేడీ సంబల్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ పూజారి బదులిచ్చారు. "ప్రధాన్‌ను ఎవరూ అప్రతిష్ఠపాలు చేయలేదు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం ద్వారా ఆయన పార్టీ, ప్రభుత్వమే ఆయన పరువు తీశాయి. పోలీసుల దౌర్జన్యాలకు నవీన్ పట్నాయక్‌ను నిందించడం ఎంతవరకు సమంజసం?" అని పూజారి ప్రశ్నించారు. ఇదిలా ఉంటే.. ప్రధాన్ పర్యటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా సుమారు 30 మంది బీజేడీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



## మంథని ప్రైవేట్ ఆసుపత్రులపై నిఘా ఏదీ..?

(మొదటి పేజీ తరువాయి)

రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. అనుమతి లేని లేదా సరైన వైద్య అర్హతలు లేని వ్యక్తులతో వైద్యం చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వైద్య సేవలకు అవసరమైన అర్హతలు, రిజిస్ట్రేషన్లు లేని వ్యక్తులు చికిత్సలు అందిస్తే రోగుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అవసరానికి మించి పరీక్షలు చేస్తున్నారా..?**

ఆసుపత్రికి వచ్చే పేద, మధ్యతరగతి రోగుల పరిస్థితిని ఆసరాగా చేసుకుని అవసరానికి మించి పరీక్షలు, మందులు, చికిత్సల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సాధారణ అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్లిన కుటుంబాలు వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పలువురు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత..? అన్నది సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్వహించే తనిఖీలతోనే తేలాల్సి ఉంది.

**అధికారులు తనిఖీలు చేపట్టాలి**

ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల విద్యార్హతలు, సంబంధిత వైద్య మండలి రిజిస్ట్రేషన్లు, వైద్య సిబ్బంది వివరాలు, ఆసుపత్రి నిర్వహణకు ఉన్న అనుమతులు, నిర్వహిస్తున్న పరీక్షలు, చికిత్సలకు అవసరమైన అనుమతులు తదితర అంశాలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. అదేవిధంగా రోగుల నుంచి వసూలు చేస్తున్న ఫీజులు, పరీక్షల చార్జీలు, మందుల విక్రయాలు, చికిత్స విధానాలపై కూడా నిబంధనల ప్రకారం పరిశీలన జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

**అనుమతులు ఉంటే వెల్లడించాలి..**

బస్టాండ్ సమీపంలోని సదరు ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం చట్టబద్ధమైన అన్ని అనుమతులు కలిగి ఉంటే వాటిని స్పష్టంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. వైద్య సేవలు అందిస్తున్న ప్రతి వైద్యుడికి సంబంధిత అర్హతలు, రిజిస్ట్రేషన్లు ఉన్నాయా అనే అంశాన్ని అధికారులు ధృవీకరించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే ఆసుపత్రి యాజమాన్యంపై ఉన్న అనుమానాలకు కూడా తెరపడనుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారుల విచారణలో తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మంథని పట్టణంలో ప్రైవేట్ ఆసుపత్రులపై వైద్య ఆరోగ్యశాఖ నిఘా పెంచుతుందా..?

బస్టాండ్ సమీపంలోని ఆసుపత్రిపై సమగ్ర తనిఖీలు ఎప్పుడు చేపడతారు..?

వైద్యుల అర్హతలు, ఆసుపత్రి అనుమతులపై అధికారులు స్పష్టత ఇస్తారా..? అనేది వేచి చూడాలి.

## ఇవాళ జరిగిన దాడిలో చనిపోయి ఉండేదాన్ని: మమతా బెనర్జీ

(మొదటి పేజీ తరువాయి)

ఆమె కాన్వాయ్‌పై కొందరు రాళ్లు, ఇటుకలు, వాటర్ బాటిళ్లు విసిరారు. పోలీసు కస్టడీలో మరణించినట్లు భావిస్తున్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కార్యకర్త బిర్జు కియోట్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మమతా బెనర్జీ వెళుతుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. దోపిడీ ఆరోపణలపై అరెస్టయిన బిర్జు, పోలీసుల కస్టడీలో మరణించాడు. ఈ నేపథ్యంలో, మమత పర్యటనను వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. ఆమె కారును చుట్టుముట్టి, దానిపై బురద పూశారు. "చోర్ భగావో" (దొంగను తరిమేయండి) అంటూ నినాదాలు చేశారు. ఈ దాడిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. పోలీసుల సమక్షంలోనే గుర్తుతెలియని వ్యక్తులు తన వాహనంపై రాళ్లతో దాడి చేశారని ఆమె ఆరోపించారు. "కారు అద్దాలు మూసి ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాను. లేదంటే ఆ రాళ్లు తలకు తగిలి నా తల పగిలిపోయేది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, వారు కేవలం అధికార బీజేపీకి మాత్రమే రక్షణ కల్పిస్తున్నారని మండిపడ్డారు. ఆమెతో పాటు ఉన్న లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, రాజ్యసభ ఎంపీ దోలా సేన్ కూడా అధికారుల వైఫల్యాన్ని విమర్శించారు. ఈ ఘటనను రాష్ట్ర బీజేపీ చీఫ్ సమీక్ భట్టాచార్య ఖండించారు. ఈ దాడితో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను డిమాండ్ చేశారు. అయితే, సీఎం సువేందు అధికారి దీన్ని మమత సృష్టించిన డ్రామాగా అభివర్ణించారు. కస్టడీ మరణాన్ని రాజకీయం చేసేందుకే మమత బలవంతంగా ఆ ప్రాంతానికి వెళ్లారని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులు అధికారుల తీరుపై సంతృప్తి చెందారని, మరణానికి కచ్చితమైన కారణం తెలియాలని మాత్రమే వారు కోరుకుంటున్నారని తెలిపారు. తన పర్యటనతో మమత ప్రజా జీవితానికి ఆటంకం కలిగించారని విమర్శించారు. ఇటీవలే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా ఆయన నియోజకవర్గంలో దాడి జరిగిన నేపథ్యంలో, తాజా ఘటనతో రాష్ట్రంలో రాజకీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

## స్వాతంత్ర్య పోరాటానికి 'క్విట్ ఇండియా' కొత్త శక్తినిచ్చింది: ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఉద్యమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించారు. వారి ధైర్యసాహసాలు, త్యాగాలు రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు. ఆగస్టు విప్లవంలో పాల్గొన్న నేతలను, సమరయోధులను స్మరించుకుంటూ ప్రధాని మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "మహాత్మా గాంధీ నాయకత్వ స్ఫూర్తితో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం మన స్వాతంత్ర్య పోరాటానికి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. వలస పాలన నుంచి విముక్తి పొందాలన్న మన ప్రజల అచంచల సంకల్పాన్ని ఇది ప్రతిబింబించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ స్మరించుకుంటున్నాను. వారి ధైర్యం ప్రతి భారతీయుడికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే" అని మోదీ తన సందేశంలో తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా క్విట్ ఇండియా ఉద్యమకారులకు నివాళులర్పించారు. ఈ ఉద్యమం దేశప్రజలందరినీ ఏకతాటిపైకి తెచ్చిందని, 'డూ ఆర్ డై' (చేయండి లేదా చావండి) అనే సంకల్పాన్ని, అద్వితీయమైన ధైర్యాన్ని వారిలో నింపిందని ఆయన గుర్తు చేసుకున్నారు. జాతి ప్రయోజనాలకు ప్రథమ స్థానం ఇస్తూ, స్వదేశీని ప్రోత్సహిస్తూ ఆత్మనిర్భర్, వికసిత భారత్ లక్ష్యాల కోసం పనిచేయడానికి ఈ రోజు స్ఫూర్తినివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సైతం ఉద్యమకారుల ధైర్యాన్ని, త్యాగాలను స్మరించుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో సమరయోధులు జాతీయ చైతన్యాన్ని రగిలించి స్వాతంత్ర్య పోరాటానికి ఒక నిర్ణయాత్మక దిశను చూపారని ఆయన పేర్కొన్నారు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత ఈ ఉద్యమం ప్రారంభమైంది. అప్పుడు మహాత్మా గాంధీ 'డూ ఆర్ డై' అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలన అంతం కావాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ ప్రభుత్వం కఠినంగా అణిచివేసినప్పటికీ, దేశవ్యాప్తంగా నిరసనలు, సమ్మెలు వెల్లువెత్తాయి. భారత స్వాతంత్ర్య పోరాట తుది దశలో ఇది ఒక మహోద్యమంగా నిలిచింది.

మన దునియా
RNI Number
మన అక్షరం - మన ప్రపంచం
ఆగస్టు | సోమవారం | 10 | 2026



# రాణి రుద్రమదేవి నుంచి శ్రీకృష్ణదేవరాయల వరకు.. బోనాల పండుగకు వేల ఏళ్ల చరిత్ర!

- కాకతీయ రాణి రుద్రమదేవి బోనం సమర్పించినట్లు ఆధారాలు
- 1516లోనే బోనాలపై పన్ను రద్దు చేస్తూ శ్రీకృష్ణదేవరాయల శాసనం
- ప్లేగు వ్యాధి కంటే ముందే బోనాలు ఉన్నాయని రుజువు చేస్తున్న పరిశోధనలు
- కుతుబ్ షాహీల కాలం నుంచీ గోల్కొండలో నిరంతరాయంగా ఉత్సవాలు

**మన దునియా,గోల్కొండ:ఆగస్టు 09**

తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ చరిత్ర నిన్నమొన్నటిది కాదని, దానికి వేల ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం ఉందని చారిత్రక ఆధారాలు వెల్లడిస్తున్నాయి. 1816లో హైదరాబాద్‌లో ప్లేగు వ్యాధి సోకినప్పుడు అమ్మవారిని శాంతింపజేయడానికి ఈ పండుగ మొదలైందని చాలామంది భావిస్తారు. కానీ, అంతకు కొన్ని వేల సంవత్సరాల ముందు నుంచే తెలంగాణ గడ్డపై ఈ సంప్రదాయం ఉందని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.చరిత్ర పరిశోధకుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ ప్రకారం, సుమారు 3 వేల ఏళ్ల కిందటే ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించే ఆచారం ఉంది. దీనికి నిదర్శనంగా కామారెడ్డి జిల్లా మరంద్రాళ్ల తండా సమీపంలోని రాతి గుట్టల్లో స్త్రీలు నెత్తిన బోనం ఎత్తుకున్న శిల్పాలు కనుగొన్నారు. అంతేకాకుండా, సుమారు 1600 ఏళ్ల కిందటి విష్ణుకుండినుల కాలం నాటి 'గర్భాపాత్ర' కూడా మేడ్చల్ జిల్లా కీసరగుట్ట వద్ద లభించింది.కాకతీయుల పాలనలోనూ బోనాలు వైభవంగా జరిగాయి. కాకతీయ రాణి రుద్రమదేవి తన కుమార్తె ముమ్మడమ్మకు సంతానం కలగాలని మొగిలిచర్లలోని ఏకవీరాదేవికి బోనం సమర్పించినట్లు ఏకామ్రనాథుడి 'ప్రతాప చరిత్ర' గ్రంథంలో ఉంది. పండితారాధ్య చరిత్రలో కూడా ఈ ఉత్సవాల ప్రస్తావన కనిపిస్తుంది.బోనాల పండుగ గురించి అధికారికంగా ప్రస్తావించిన మొట్టమొదటి శిలాశాసనం శ్రీకృష్ణదేవరాయల



కాలం నాటిది. క్రీ.శ. 1516 మే 4న వేయించిన ఈ శాసనం ప్రస్తుతం హైదరాబాద్‌లోని రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలో ఉంది. తెలంగాణ–కర్ణాటక సరిహద్దులోని గొబ్బూరులో లభించిన ఈ శాసనంలో, బోనాల పండుగ నిర్వహణ కోసం రాజ్యం నుంచి చెల్లించాల్సిన పన్నులను రద్దు చేస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు.హైదరాబాద్ నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్ షా కాలంలోనూ బోనాల సంప్రదాయం కొనసాగింది. శాలిబండ గ్రామంలో బోనాలు జరుపుకుంటున్న దృశ్యాలున్న ఒక సూక్ష్మ చిత్రపటం దీనికి సాక్ష్యంగా నిలుస్తోంది. గోల్కొండ కోటలోని జగదాంబిక ఆలయంలో గత 400 ఏళ్లుగా ఆషాఢ బోనాలు నిరంతరాయంగా జరుగుతున్నాయి. ఈ ఆధారాలన్నీ పరిశీలిస్తే, 1816లో ప్లేగు వ్యాధి నిర్మూలన కోసం ప్రారంభమైందన్న వాదన కంటే ఎంతో ముందే బోనాల పండుగ తెలంగాణ జనజీవనంలో, సంస్కృతిలో భాగమైందని స్పష్టమవుతోంది.

# ప్రజాస్వామ్యంలో ఎంతటి వారైనా మెడలు వంచక తప్పదు

**టీపీసీసీ చీఫ్**

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09**

క్విట్ ఇండియా గొప్పతనాన్ని యువతరం తెలుసుకోవాల్సి ఉందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా కీలక ఘట్టమని అభివర్ణించారు. ఆదివారం నాంపల్లిలోని గాంధీ భవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఆగస్టు 8వ తేదీన మహాత్మా గాంధీ ఇచ్చిన పిలుపుతో యావత్ భారతదేశం కదం తొక్కిందని గుర్తు చేశారు. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతోపాటు సుభాష్ చంద్రబోస్.. ఈ క్విట్ ఇండియా ఉద్యమానికి స్ఫూర్తి అని తెలంగాణ పీసీసీ చీఫ్ గుర్తు చేశారు. బ్రిటిష్ వాళ్లు భారత్ విడిచి వెళ్ళిపోవడానికి ఈ ఉద్యమమే ప్రధాన కారణమని వివరించారు. కేంద్రం మొండి వైఖరికి వ్యతిరేకంగా జెన్ జీ ఉద్యమం చేపట్టిందని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమం గురించి తెలుసుకోవాలని జెన్ జీ ఉద్యమ వీరులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వేలాది మంది సర్వం కోల్పోయి ప్రాణత్యాగాలు చేస్తేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తు చేశారు.అయితే ప్రస్తుతం దేశంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని నెహ్రూను మరిపించే ప్రయత్నం జరుగుతుందని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్దార్ పటేల్‌ను బీజేపీ సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తుందని అసహనం వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచే వారికి క్విట్ చెప్పాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎంతటి వారైనా మెడలు వంచక తప్పదని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రావటానికి గల కారణాలను యువత అధ్యయనం



చేయాలని అభిప్రాయపడ్డారు.దేశం ఆశ్చర్యం పోయేలా తెలంగాణలో అభివృది, సంక్షేమం జరుగుతున్నాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉందని.. ఆ సమయంలో రాష్ట్రాన్ని ఏం ఉద్ధరించలేదని విమర్శించారు. ఉద్యోగాల విషయంలో బీఆర్ఎస్ నేతల చేస్తున్న ప్రగల్భాలు హాస్యాస్పదమని అన్నారు. సద్విమర్శ చేయండి.. అంతే కానీ అసత్యాలు మాట్లాడకండంటూ ప్రతిపక్షాలను తీవ్ర స్వరంతో హెచ్చరించారు. అభివృధి, సంక్షేమం.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకొస్తుందని ఆయన జోస్యం చెప్పారు. కార్యకర్తల కష్టాన్ని మరిచిపోమని పార్టీ శ్రేణులకు ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. సర్ ప్రక్రియలో ఓట్లు తొలగించే కార్యక్రమం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ల తొలగింపును అడ్డుకొని అర్హత కలిగిన ఓటును కాపాడుతున్నామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కుల వివక్ష లేకుండా పోరాటం చేస్తున్నామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# ఈ సూపర్ స్టార్ ఆఫీసర్లకు ఏమైంది?

**ఏపీలో ఆమ్రపాలి, తెలంగాణలో స్మితా సబర్వాల్!**

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09**

తెలుగు రాష్ట్రాల్లో తమ పాలనా శైలితో ప్రత్యేక ముద్ర వేసిన ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు -- ఏపీలో కాట ఆమ్రపాలి, తెలంగాణలో స్మితా సబర్వాల్. ఇద్దరూ అత్యంత సమర్థులైన, డైనమిక్ ఆఫీసర్లుగా పేరు తెచ్చుకున్నారు. ఏ బాధ్యతలు అప్పగించినా తమదైన మార్కుతో పూర్తి చేసి సక్సెస్ చేస్తారనే గుర్తింపు తెచ్చుకున్నారు.కానీ, అలాంటి అధికారులు ఇప్పుడు ఎందుకు లూప్‌లైన్‌లోకి వెళ్లిపోయారనేదే బ్యూరోక్రసీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.కాట ఆమ్రపాలి: ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత కేటాయింపుల్లో ఏపీ క్యాడర్‌కు వెళ్లాల్సి వచ్చినా, మొదటి నుంచీ తెలంగాణ క్యాడర్‌లోనే పనిచేయాలని ఆకాంక్షించారు. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత కూడా ఏపీకి వెళ్లక తప్పకపోవడం, అక్కడ అనుకూల వాతావరణం లేకపోవడంతో వరుస సెలవుల్లోకి వెళ్లిపోయి, చివరికి పోస్టింగ్ లేని బదిలీ ఎదుర్కొన్నారు.స్మితా సబర్వాల్: తెలంగాణలో సుదీర్ఘకాలం పాటు సీఎంఓతో పాటు పలు కీలక శాఖల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆమె.. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఇతర అధికారుల తరహాలో “బ్యూరోక్రాటిక్ లౌక్యం” ప్రదర్శించలేకపోయారు.





## బోనమెత్తిన హైదరాబాద్”

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09**



లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి అమ్మవారి బోనాల వేడుకల సందర్భంగా ఈ రోజు ఉదయం 4:30 గంటలకే ఆలయ తలుపులు తెరిచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మ వారికి తొలిబోనాన్ని సమర్పించి ఉత్సవా లను ప్రారంభించారు. భాగ్యనగరం అంతా అమ్మవారి బోనాలతో నగరమంతా ప్రత్యేక శోభా సంతరించు కుంది నగరంలోని ఆయా ప్రాంతాల్లో కొలువైన పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, భవాని, మహంకాళి తదితర అమ్మవార్ల ఆలయాలకు బోనం సమర్పించేందుకు భక్తులు ఉదయం నుంచి పోటెత్తారు. బోనాల జాతర సందర్భంగా పలువు రు ప్రముఖులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు సినీ ప్రము ఖులు అమ్మవారిని దర్శించుకుని మొక్కు లు తీర్చుకున్నారు. లాల్ దర్వాజా అమ్మ వారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ప్రభుత్వ తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలయాన్ని దర్శించుకుని బంగారు బోనాన్ని నివేదించారు.అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారిని మంత్రి శ్రీధర్ బాబు, మంత్రి సీతక్క, దర్శించు కుని పట్టువస్త్రాలు సమర్పించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ దర్శించుకున్నారు.

## 80 శాతం ఉన్న హిందువులకు రూ.20 కోట్లు ఇస్తారా?: బండి సంజయ్

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09**



తెలంగాణ:బోనాల పండగకు ప్రభుత్వం మొక్కుబడిగా డబ్బులు ఇచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆదివారం ఆయ మీడియాతో మాట్లాడుతూ.. 'రూ.20 కోట్లు మాత్రమే ఇచ్చింది. 80 శాతం ఉన్న హిందువులకు రూ.20 కోట్లు ఇస్తారా? 20 శాతం ఉన్న ముస్లిం పండుగలకు రూ.30 కోట్లు ఎలా ఇస్తారు? మా పండుగలకు డబ్బులు ఇవ్వకుంటే అడగొద్దా? ఎక్కువ ట్యాక్సులు కట్టేది హిందువులు. మజ్లిస్‌ను గెలిపించేందుకే మన గుడికి డబ్బులు ఇవ్వడం లేదు' అని ఆరోపించారు.

## తెలంగాణ:డ్రగ్స్,సైబర్ క్రైమే ప్రధాన సవాళ్లు:డీజీపీ

**మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09**



తెలంగాణలో మావోయిజం దాదాపు పూర్తిగా కనుమరుగైందని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. మావోయిస్టు బాధిత కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వరంగల్‌లో పర్యటిస్తున్న ఆయన, ఐపీఎస్‌గా తన ప్రస్థానం ఈ జిల్లాలోనే ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ క్రైమ్ ప్రధాన సవాళ్లుగా మారాయని, సైబర్ నేరాలతో ప్రజలు భారీగా డబ్బు నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో అధిక లాభాల ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు.. లబ్ధిదారుల ఎంపిక కోసం లాటరీ ఎప్పుడంటే?




**మన దునియా,హైదరాబాద్: ఆగస్టు 09**

హైదరాబాద్ క్యూర్ పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు విశేష స్పందన లభిస్తోంది. 16 నియోజకవర్గాల్లో 7,340 ఇళ్ల కోసం శనివారం నాటికి 35,125 దరఖాస్తులు అందాయని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతమ్ తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 10 వరకు కొనసాగుతుంది. ఆగస్టు 20న లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఏడాదిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పారదర్శకత కోసం లాటరీ విధానాన్ని అనుసరించనున్నారు.

మన దునియా
RNI Number
మన అక్షరం – మన ప్రపంచం

## ఆగస్ట్ 15న ప్రారంభించబోయే కొత్త పథకాలు ఇవే!

మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09




తెలంగాణ ప్రభుత్వం ఈసారి స్వాతంత్ర్య దినోత్సవాన్ని సంక్షేమ కార్యక్రమాల విస్తరణకు వేదికగా మార్చనుంది. ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంగారెడ్డి జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నారు. కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు, 5 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్, 3-4 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించే అవకాశాలున్నాయి. గిగ్ వర్కర్లకు చట్టపరమైన రక్షణ, సనత్‌నగర్‌లో ౧×మీా ప్రారంభం, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై కీలక ప్రకటనలు వెలువడనున్నాయి. సెప్టెంబర్‌లో ఇందిరమ్మ టవర్లకు శంకుస్థాపన జరగనుంది.

## మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంట్లో బీసీ నేతల భేటీ...!

మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09



మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, కేకే, వీహెచ్, పలువురు ఎమ్మెల్యేలు సహా బీసీ నేతలు సమావేశమయ్యారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్ పక్కన జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి విగ్రహాలతో పాటు ట్యాంక్ బండ్‌పై ఉన్న సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాల ఆవిష్కరణ తేదీలపై వీరు చర్చించారు. బీసీ సంక్షేమ పథకాలు జనాలకు అందుతున్న తీరు, బలహీన వర్గాల ఆర్థిక వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలు పూర్తి చేయడం, పార్టీ బలోపేతం గురించి మాట్లాడుకున్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు.. అక్రమాలకు చెక్ పెట్టేలా కార్డుల తయారీ!

మన దునియా,హైదరాబాద్:ఆగస్టు 09




రాష్ట్రంలో 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 15న లాంఛనంగా ప్రారంభించనున్నారు. నకిలీలు, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ట్యాంపర్ ప్రూఫ్, లామినేటెడ్ కార్డులను రూపొందించింది. దీంతో కార్డుల్లో వివరాలను మార్చేందుకు ఎవరికీ సాధ్యం కాదు. ఈకేవైసీ పూర్తయిన తర్వాత, ఆధార్ ఆధారంగా ఇంటి యజమాని (ఇంటి ఇల్లాలి) ఫోటోతో కూడిన కార్డులను అందించనున్నట్లు సమాచారం.

## మృతుని కుటుంబానికి పీసీఆర్ ఫౌండేషన్ చేయూత

**50 కిలోల బియ్యం అందజేత**

ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం; ఆగస్టు 09:

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం సుందరయ్య నగర్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శనిగారపు మహేష్ కుటుంబానికి పీసీఆర్ (పూర్ణచందర్‌రావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సహాయం అందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ కుమార్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బాధిత కుటుంబానికి తమ వంతు సహకారం అందించడంతో పాటు భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఫజల్ ఖాన్, మున్వర్ అలీఖాన్, సులువ జనార్ధన్, ఇమ్రాన్, చింతల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కవ్వాల్ ఉప సర్పంచ్ నల్ల తీగల విష్ణు జన్మదిన వేడుకలు





ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం; ఆగస్టు 09:

జన్నారం మండలం కవ్వాల్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ నల్ల తీగల విష్ణు జన్మదిన వేడుకలను గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, గ్రామ యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జన్నారం మండల నాయకులు ఫజల్ ఖాన్, మున్వర్ అలీ ఖాన్ హాజరై నల్ల తీగల విష్ణుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు, యువత, స్నేహితులు, అభిమానులు విష్ణుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, వార్డు సభ్యులు, స్నేహితులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి






- **10 మంది అదుపులో, రూ.83,010 నగదు, 52 పేకముక్కలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం**

మన దునియా, ఆగస్ట్ 09,మంచిర్యాల జిల్లా

మంచిర్యాల జోన్ నెన్నెల పోలీస్ స్టేషన్ పరిధిలోని మన్నెగూడెం గ్రామ శివారులో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు.టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వంలో ఎస్ఐలు రమేష్, లచ్చన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకుని, రూ.83,010 నగదు, 52 పేకముక్కలు,8 మొబైల్ ఫోన్లు,ఒక హీరో గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.పేకాట నిర్వహించినట్లు గుర్తించిన ఆర్గనైజర్ రాళ్లపేట శ్రీకాంత్‌తో పాటు శ్రీను, రాజ్‌కుమార్ పరారీలో ఉన్నారు.వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.స్వాధీనం చేసుకున్న నగదు, పేకముక్కలు, మొబైల్ ఫోన్లు,ద్విచక్ర వాహనంతో పాటు అదుపులోకి తీసుకున్న వ్యక్తులను తదుపరి చర్యల కోసం నెన్నెల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

# గిరిజన పల్లెల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి: తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం

ఖానాపూర్ ఆర్సి మన దునియా,జన్నారం;ఆగస్టు 9:

గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పక్కా ఇళ్లు, విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను తక్షణమే కల్పించాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా జన్నారం మండలం తపాలపూర్ గ్రామంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా టీఏజీఎస్ మండల నాయకులు ఆత్రం రాజు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు 1994లో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించిందని పేర్కొన్నారు.కనికరపు అశోక్ మాట్లాడుతూ.. ఆదివాసుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెబుతున్నప్పటికీ, వాటి ఫలాలు గిరిజనుల జీవితాల్లో ఆశించిన మార్పును తీసుకురావడం లేదని అన్నారు. అడవినే జీవనాధారంగా చేసుకుని జీవిస్తున్న ఆదివాసుల మనుగడ అటవీ ప్రాంతంతో ముడిపడి ఉందన్నారు. పెత్తందారులు, అగ్రవర్ణాల ఆధిపత్యం కారణంగా గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.మారుమూల గిరిజన పల్లెల్లో ఇప్పటికీ రోడ్లు, తాగునీరు, పక్కా ఇళ్లు, విద్య, వైద్యం, రవాణా సదుపాయాలు లేక ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా సౌకర్యం లేక గర్భిణీలు పురిటి నొప్పులతో ఆస్పత్రులకు వెళ్లే మార్గంలోనే ప్రసవించే పరిస్థితులు తరచూ ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రతి వర్షాకాలంలో విషజ్వరాలు ప్రబలుతున్నా సరైన వైద్య సదుపాయాలు అందక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.గిరిజనుల సమస్యలను ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, మారుమూల గిరిజన గ్రామాలకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కులు, జీవనోపాధి, అటవీ హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఆత్రం భీమ్, ఆత్రం సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే దొరకడం అదృష్టం




**చేసుకోవాలి జాబ్ మేళా ప్రతి ఒక్కరూ సద్వినియోగం**
**మెగా జాబ్ మేళాలో సీపీ సాయి చైతన్య**
**రెండున్నర వేలకుపైగా నిరుద్యోగులు హాజరు**
**ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

ప్రజాభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే దొరకడం నిజామాబాద్ యువత అదృష్టమని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీరామ గార్డెన్ లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ... ఇంత వద్ద మొత్తంలో జాబ్ మేళా నిర్వహించటం అభినందనీయమన్నారు.రాజకీయంతో పాటు ప్రజల అభివృద్ధికి పాటుపడే వారు. అరుదుగా ఉంటారన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నాలజీని వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కానీ అదే టెక్నాలజీకి వ్యసనం కాకూడదని సూచించారు. ఉద్యోగాలు రానివాళ్లు నిరాశ చెందకుండా మరింత ప్రయత్నించాలన్నారు. ప్రస్తుత ప్రయత్నాన్ని అనుభవంగా పొంది భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిదుకోవాలన్నారు. ఇందూరు యువతలో ఎంతో ప్రతిభ దాగి ఉంది. వారి ప్రతిభకు ఆవకాశం కల్పించడం కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఇందూరు భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు.తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తారని, తన బిడ్డ మంచి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలనేది వారి కోరిక అన్నారు. యువతకు ఉద్యోగం కల్పించడం అంటే కేవలం ఒక వ్యక్తికి ఉద్యోగం ఇవ్వడం కాదని ఒక కుటుంబానికి భరోసా ఇవ్వడం అని స్పష్టం చేశారు. యువతకు సరైన వేదిక దొరకడం లేదని ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని 70కి పైగా కంపెనీలను ఒకే వేదిక పైకి



తీసుకోవచ్చామని తెలిపారు. ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు భయపడకుండా తమపై నమ్మకం పెట్టుకోవాలన్నారు. యువత ఉద్యోగాల కోసం తప్పనిసరిగా హైదరాబాది, ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలన్నారు. నిజామాబాదులో అవకాశాలు పెరగాలని అదే తన లక్ష్యమని పేర్కొన్నారు. నిజామాబాద్ ను ఐటీ హబ్ గా మార్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు ఇటీవల ఐటీ శాఖామంత్రి శ్రీధర్ బాబును కలిసి పలు ప్రతిపాదనలు అందజేయడం జరిగిందన్నారు. త్వరలోనే నిజామాబాద్ ను ఐటీ హబ్ గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యువతకు తోడుగా నిలుస్తామని చెప్పారు. జాబ్ మేళాకు సుమారు రెండున్నర వేలకుపైగా అభ్యర్థులు హాజరయ్యారు. అనంతరం ఆయా కంపెనీలో ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, మఠం పవన్, శ్రవణ్, పసునూరి రాము, ప్రసూన శ్రీనివాస్, ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, బంటు రాము, బంటు ప్రీతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌స్టాగ్రామ్ పరిచయం.. అనుమానంతో హత్య!

- **ఇన్‌స్టాల్ ,ఫేస్ బుక్,షోషల్ మీడియా లలో ఆక్టివ్ గా అమ్మాయిలు ఈ న్యూస్ మీ కోసమే....తస్మాత్ జాగ్రత్త...ఇన్‌స్టాల్ లో పరిచయం అన్నాడు.... తరువాత ప్రేమ అన్నాడు....తరువాత అనుమానం పెంచుకున్నాడు....అనుమానం పెద్ద పెను భూతం అయ్యి...పెట్రోలు పోసి చంపాడు!...పోలీసుల విచారణ లో నమ్మలేని నిజాలు!**

**మన దునియా,పల్నాడు జిల్లా:ఆగస్టు 09**

ప్రియురాలిని అతి కిరాతకంగా పెట్రోల్ పోసి హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లాలో వెలుగు చూసిన ఘటన అందరిని తెలిసిందే చిలకలూరిపేటకు చెందిన హసీనా గుంటూరు జిల్లాలోని మిట్లపల్లి కాలేజ్ లో బిటెక్ చదివింది. ఆ సమయంలో పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఇనుపరాజుపల్లికి చెందిన బాల సైదులుతో ఆమె ఇన్ స్టాగ్రాంలో పరిచయడం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త ప్రేమగా మారింది. గత ఐదేళ్లుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. బీటెక్ పూర్తి కావడంతో హసీనా సూళ్లూరుపేటలోని ఒక ప్రవేటు కంపెనీలో ఉద్యోగిగా జాయిన్ అయింది. చిలకలూరిపేటలో చదువు పూర్తి కావడంతో స్వంత గ్రామానికి చేరిన బాల సైదులు పొలం పనులు చేస్తున్నాడు. అయితే ఉద్యోగంలో చేరిన తర్వాత హసీనా బాల సైదులతో మాట్లాడటం తగ్గించింది. దీంతో బాల సైదులు ఆమెను అనుమానించడం మొదలు పెట్టాడు. వేరే వ్యక్తులతో మాట్లాడుతున్నట్లు నిర్ధారణకు వచ్చాడు. దీంతో ఆమెను ఎలాగైనా చంపాలని నిర్ణయం తీసుకున్నాడు. ఈ క్రమంలోనే హసీనాతో మాట్లాడని.. ఆమెను సూళ్లూరు పేట నుండి చిలకలూరిపేట వచ్చేలా చేశాడు. పేట చేరుకున్న హసీనాను కారంపూడి రావాలని వేడుకున్నాడు. అక్కడి వచ్చిన ఆమెను కాలువ కట్టపై నిర్మానుషంగా ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లి వెంట తెచ్చిన కత్తితో పొడిచి చంపేశాడు.ఆ తర్వాత ఆనవాళ్లు దొరకకూడదని భావించి.. పెట్రోల్ పోసి తగులబెట్టి అక్కడ నుండి వెళ్లిపోయాడు. ఇక ఇప్పుడే వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన హసినా తిరిగిరాకపోవడంతో కంగారు పడిన ఆమె కుటుంబ సభ్యులు స్థానిక పీఎస్‌లో మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చారు. బాధితుల ఫిర్యాదుతో ఘటనపై కేసు నమోదు చేసుకన్న పోలీసులు.. హసీనా కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే కారంపూడి మండలంలోని నాగార్జున సాగర్ కాలువ కట్టపై ఓ గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. మృతదేహం కొంతమేర కాలిపోయి మిగిలిన భాగం కుళ్లిపోయి ఉన్నట్టు గుర్తించారు. దీంతో మృతదేహాన్ని గుర్తించేందుకు పోలీసులు అక్కడికక్కడే పోస్టు మార్టమ్ నిర్వహించి.. ఆ బాడీ హసీనాదిగా తేల్చారు. అనంతరంపై కేసు దర్యాప్తులో వేగం పెంచిన పోలీసులు.. నిందితుడిగా అనుమానించిన బాల సైదులను అదుపులోకి తీసుకొని విచారించగా తనే చింపేసినట్లు ఒప్పుకున్నాడు.దీంతో బాల సైదులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు పోలీసులు.




# చైతన్యమే శాశ్వతం



జీవన్మరణాలు ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. ఈ సృష్టిలో ఆది లేని అంతం, అంతం లేని ఆది ఉండవు. ప్రతి వస్తువుకూ ఒక పరిసమాప్తి తప్పనిసరి. నిజానికి, మరణమనే గమ్యం ఉండబట్టే జీవితానికి ఒక అర్థం, పరమార్థం లభిస్తున్నాయి. జన్మించిన ప్రతి ప్రాణికీ మరణం అనివార్యం. జీవితం ఒక నిరంతర ప్రవాహం అయితే, మృత్యువు ఆ ప్రవాహం పరవశంతో కలిసే అనంత సాగరం.ప్రకృతి నియమం ప్రకారం ఏ పదార్థమైనా రూపాంతరం చెందాల్సిందే. పంచభూతాల కలయికతో నిర్మితమైన శరీరం కూడా కాలక్రమేణా వార్ధక్యానికి, వ్యాధులకూ లోనై చివరికి మట్టిలో కలవక తప్పదు. పండుటాకులు రాలడం ఎంత సహజమో, శరీరం మట్టిలో కలవడం కూడా అంతే సహజం. వాస్తవానికి మరణం దేహానికి మాత్రమే పరిమితం. భారతీయ తత్వశాస్త్రం ప్రకారం– మనిషి అంటే నశించే దేహం, నశించని చైతన్యాల కలయిక. ఈ సత్యాన్ని గ్రహించడమే మరణం పట్ల భయాన్ని పోగొట్టుకోవడానికి మొదటి మెట్టు.నిరంతర శ్రమతో అలసిన దేహాన్ని నిద్ర ఎలాగైతే సేదదీరుస్తుందో, జీవితయాత్ర ముగిశాక లభించే పరమ విశ్రాంతే మరణం. అది ఎప్పుడు, ఏ రూపంలో పలకరిస్తుందో తెలియని ఆ అనిశ్చితే నిజానికి జీవితాన్ని మరింత విలువైనదిగా మారుస్తుంది. తాత్విక దృష్టితో చూస్తే– మనలోని అహంకారాన్ని, అపరిమితమైన కోరికలను విస్మరించడమే మోక్షసాధనలో మొదటి ఘట్టం. ఎవరైతే తమ అహాన్ని త్యజిస్తారో, వారు మృత్యువునొక సహజ పరిణామంగా ఆహ్వానించగలరు. 'వాసాంసి జీర్ణాని యథా విహాయ'– మనిషి పాత వస్త్రాలను విడిచి కొత్తవి ధరించినట్లే, ఆత్మ కూడా జీర్ణమైన శరీరాన్ని వీడి మరో కొత్త దేహాన్ని ఆశ్రయిస్తుందన్నది గీతాబోధ. దీని ప్రకారం, మరణమనేది బాహ్యరూపాన్ని మార్చుకునే ఒక ప్రక్రియ మాత్రమే. దేహం క్షరమైనదీ, క్షీణించేదీ కావచ్చు కానీ దాంట్లోని చైతన్యం అక్షరమైనది అంటే, శాశ్వతమైనది. మృత్యువు నిరుపమానమైన సమతావాది. రాజునైనా, నిరుపేదనైనా ఒకేలా ఆలింగనం చేసుకుంటుంది. నేను, నాది అనే అహంకార మమకారాలను సమూలంగా తుడిచిపెట్టే అద్వితీయ శక్తి మరణానికే ఉంది. అది మాయా ప్రపంచం నుంచి విముక్తిని ప్రసాదించే మోక్షద్వారంలా గోచరిస్తుంది. మరణం అనివార్యమనే పరమ సత్యాన్ని హృదయపూర్వకంగా అంగీకరించినప్పుడు, మనిషి ప్రాపంచిక బంధాల సంకెళ్ల నుంచి స్వేచ్ఛ పొంది, నిజమైన ఆత్మశాంతిని అనుభవిస్తాడు. ఈ అనంతమైన చైతన్యం ఒక మహాసముద్రమైతే, భౌతిక దేహం అందులో క్షణకాలం ఉద్భవించే కెరటం వంటిది. అలలు తీరాన్ని తాకి అంతమవ్వవచ్చు కానీ ఆ సముద్రం మాత్రం శాశ్వతమే! దేహం అశాశ్వతమని అర్థంచేసుకున్నప్పుడు మనిషిలో అహంకారం సమసిపోతుంది. చైతన్యం సజీవమైనదన్న ఎరుకతో ఉన్నప్పుడు అజేయమైన ధైర్యం కలుగుతుంది. ఈ సత్య దర్శనమే సరైన జీవనమార్గం. మరణం పట్ల భయాన్ని వీడి, అమరత్వపు వెలుగులో జీవించడమే మన కర్తవ్యం.

# శ్రీరాంసాగర్‌లో 40 టీఎంసీల నీరు.. ఆశాజనకంగా నీటిమట్టం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మన దునియా:**

తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్?లో ఎగువ నుంచి వరద వస్తోంది. మహారాష్ట్రతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 13,465 క్యూసెక్కులు మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ (పోచంపాడ్) ప్రాజెక్టుకు వరద నీరు కొనసాగుతోంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో ప్రాజెక్టులోకి భారీగా ఇన్‌ఫ్లో చేరుతోంది. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 13,465 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు అధికారులు తెలిపారు.

గతేడాది నీటిమట్టం దాటి?..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు, పూర్తి సామర్థ్యం 80.50 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1,078.80 అడుగుల వద్ద 40.907 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 1,078.30 అడుగుల వద్ద 40.583 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, ప్రస్తుతం గత ఏడాదితో పోలిస్తే స్వల్పంగా ఎక్కువ నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 462 క్యూసెక్కులు కలిపి మొత్తం 993 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది.

## భారీ కాన్వాయ్‌తో నల్లబెల్లికి కేసీఆర్..!

**పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ**
**కేసీఆర్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు**

**మన దునియా, వరంగల్ జిల్లా । ఆగస్టు 09**



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు భారీ కాన్వాయ్‌తో నల్లబెల్లికి చేరుకున్నారు. ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.కేసీఆర్ నల్లబెల్లికి వస్తున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. కేసీఆర్‌ను చూసేందుకు రహదారుల వెంట ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు భారీగా గుమిగూడారు.పెద్ది సుదర్శన్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేసుకున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కేసీఆర్ పర్యటనతో నల్లబెల్లిలో బీఆర్ఎస్ శ్రేణుల్లో సందడి నెలకొంది. భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో నల్లబెల్లి పరిసరాలు కిక్కిరిసిపోయాయి. కేసీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎగ్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# టెక్నాలజీ యుగంలోను ఆదివాసి సాంప్రదాయ మంత్రసానులు/దాయిల జ్ఞానమే ఆదివాసుల ఆరోగ్యానికి రక్ష





- **ఆదివాసి మంత్రసానుల సన్మాన సభలో ప్రభుత్వం వారికి గుర్తింపు, గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేసిన**
- **ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి**

**మన దునియా,గుడిహత్నూర్:ఆగస్టు 09**

గుడిహత్నూర్:ఈ రోజు అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి సేన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గూడిహత్నూర్ మండల కేంద్ర పరిధిలోని ఆదివాసి విజ్ఞాన కేంద్రం వద్ద ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్ ఆధ్వర్యంలో ఆదివాసి మంత్రసానుల సన్మాన సభ ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఐక్యరాజ్యసమితి జెండాను ఆవిష్కరించారు. ఆ తర్వాత ఆదివాసి మంత్రసానులు/దాయిలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినారు. తదనంతరం మంత్రసానులకు ప్రశంస పత్రాలు, శాలువా, పూల బోకేలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి ఈ సంవత్సరం ఐక్యరాజ్యసమితి ఇచ్చిన థీమ్ ఆదివాసి వైద్య మంత్రసానులను గౌరవించడం జీవితాన్ని మరియు శ్రేయస్సును కాపాడటం పై మాట్లాడుతూ మా గోండు సమాజంలో మంత్రసానులు/దాయిలు మా సంస్కృతికి, ఆరోగ్యానికి వెన్నుముక లాంటి వారు అని అన్నారు. వారు తరతరాలుగా వన మూలికా వైద్యం, గర్భ సంరక్షణ జ్ఞానాన్ని కాపాడుతు వస్తున్నారన్నారు.కాని నేడు వారికి ప్రభుత్వ పరంగా గుర్తింపు, గౌరవం, లేకపోవటం చాలా బాధకరం అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివాసి మంత్రసానుల సాంప్రదాయ జ్ఞానానికి ప్రభుత్వం అధికారిక గుర్తింపును ఇవ్వాలని వారికి శిక్షణ కీట్లు గౌరవ వేతనం అందించాలని, వారి మూలికా వైద్య జ్ఞానాన్ని ఏఐ/డిజిటల్ ద్వారా భద్రపరచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్ ఆదివాసి సేన రాష్ట్ర నాయకులు పేందోర్ విశ్వనాథ్, ఆదివాసి రైతు సేన జిల్లా అధ్యక్షులు వేద్మ చంపత్ రావు, ఆదివాసి ఎంప్లాయీస్ ఫేడరేషన్ జిల్లా కన్వీనర్ కుంరం దశరథ్, ఆదివాసి సేన మండల ఉపాధ్యక్షులు పేందోర్ గోవింద్, ఆదివాసి సర్పంచులు మడవి ముకుంద్ రావు, సిడం లక్కు, ఆదివాసి నాయకులు మెస్రం మోహన్, కుంరం సంభూ, మడవి ఆనంద్ రావు, మడవి రమేష్, మహిళ నాయకులు మడవి సోనుబాయీ, తోడషం ధన లక్ష్మి మరియు మంత్రసానులు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్ పలు అంశాలపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**మన దునియా,జయశంకర్ భూపాలపల్లి జిల్లా:ఆగస్టు 09**

ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా భూపాలపల్లి జిల్లాకు వచ్చిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్ పలు అంశాలపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సైబర్ నేరాలు, గంజాయి అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణ, కల్తీ ఆహారం, పోలీసు సిబ్బంది సంక్షేమం, మహిళల భద్రత తదితర అంశాలపై వివరించారు.

పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

డీజీపీ కార్యాలయంలోనే బెటాలియన్ సిబ్బంది ఆత్మహత్య చేసుకున్న ఘటనపై స్పందించిన డీజీపీ.. ఆత్మహత్యలకు దారితీస్తున్న కారణాలను లోతుగా విశ్లేషించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పోలీసు సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొంటూ, పోలీస్ ప్రధాన కార్యాలయంలో నూతన జిమ్ సెంటర్‌ను డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. సిబ్బంది ఆరోగ్యంగా, ఉత్సాహంగా విధులు నిర్వహించేందుకు ఇలాంటి సౌకర్యాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

సైబర్ నేరాలు పెద్ద పట్టణాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నాయని డీజీపీ తెలిపారు. పరిచయం ఉన్న వ్యక్తులు సైతం సైబర్ మోసాలకు గురై బ్యాంకు ఖాతాల్లోని డబ్బును కోల్పోతున్నారని పేర్కొన్నారు.రిటైర్మెంట్ అనంతరం వచ్చిన సొమ్మును కూడా కొందరు సైబర్ మోసగాళ్ల చేతిలో కోల్పోతున్నారని అన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఆన్‌లైన్ గ్యాంగులు ప్రజలను మోసం చేస్తున్నాయని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడంతో పాటు నేరస్తులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

గంజాయిపై ఉక్కుపాదం

భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డీజీపీ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై రెండు జిల్లాల ఎస్పీలతో లోతుగా చర్చించి, సమర్థవంతమైన చర్యలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక వ్యవస్థ

రోడ్లపై అక్రమ పార్కింగ్, ఇతర కారణాల వల్ల ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం జరుగుతోందని డీజీపీ తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు హైవే పెట్రోలింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు ట్రాఫిక్, రోడ్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అరైవ్ అలైవ్ కార్యక్రమంలో హెల్మెట్ల పంపిణీ

రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడంలో భాగంగా నిర్వహిస్తున్న “ూ==×ఎజు ూూ×ఎజు” కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని డీజీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు సిబ్బందికి డీజీపీ సీవీ ఆనంద్ హెల్మెట్లను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, విధి నిర్వహణలోనూ వ్యక్తిగత ప్రయాణాల్లోనూ హెల్మెట్ ధరించడం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని నివారించవచ్చని తెలిపారు.

కల్తీ ఆహారంపై కఠిన చర్యలు

ప్రజలు తీసుకుంటున్న ఆహారం నాణ్యతపై ఆందోళన కలిగించే పరిస్థితులు ఉన్నాయని డీజీపీ అన్నారు. కల్తీ ఆహార పదార్థాలపై నిఘా పెంచడంతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో తనిఖీలు, దాడులు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూపాలపల్లి, ములుగు పోలీసులకు మౌలిక వసతుల కల్పన

చిన్న జిల్లాలైన భూపాలపల్లి, ములుగు ప్రాంతాల్లో పోలీసు శాఖకు అవసరమైన కొన్ని మౌలిక వసతులు పూర్తిస్థాయిలో లేవని సమీక్షలో గుర్తించినట్లు డీజీపీ తెలిపారు. పోలీసు సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన బడ్జెట్ కేటాయింపులు తీసుకువచ్చి చర్యలు చేపడతామని చెప్పారు.

నక్సలైట్ హింస ప్రభావిత కుటుంబాలకు అండ

గతంలో నక్సలైట్ హింస కారణంగా ప్రభావితమైన కుటుంబాలతో చర్చించి, వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక, ఇతర సహాయాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ తెలిపారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో క్రైమ్ రివ్యూతో పాటు భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీసు అధికారులతో నేరాల నియంత్రణపై లోతైన సమీక్ష నిర్వహించినట్లు వెల్లడించారు.

భూ వివాదాల్లో చట్ట ప్రకారం చర్యలు

భూ వివాదాల విషయంలో ఎవరూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించేందుకు అనుమతి లేదని డీజీపీ స్పష్టం చేశారు. సంబంధిత పత్రాలను పరిశీలించి, వాస్తవాలను తెలుసుకున్న అనంతరం నిబంధనల ప్రకారం సమస్యకు పరిష్కారం చూపుతామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళల భద్రతకు భరోసా కేంద్రాలు...

సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కుటుంబ, మహిళలకు సంబంధించిన సమస్యలు కూడా పెరుగుతున్నాయని డీజీపీ పేర్కొన్నారు. మహిళలకు అండగా నిలిచేందుకు తెలంగాణలో పనిచేస్తున్న భరోసా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళలకు అవసరమైన సహాయం, రక్షణ అందించేందుకు పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందని వెల్లడించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఆధునిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేలా పోలీసు శాఖను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్, ఐపీఎస్ తెలిపారు.



మన దునియా
RNI Number TT/TT/2073/55/60
మన అక్షరం – మన ప్రపంచం



# సాయి సుదర్శన్‌కు గాయం.. సర్ఫరాజ్ ఖాన్‌కు భలే చాన్స్!

**శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు సాయి సుదర్శన్ దూరం**

**కాలి వేలి గాయంతో బాధపడుతున్న సుదర్శన్**

**అతని స్థానంలో జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్**

**ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న రెండు మ్యాచ్‌ల సిరీస్**

**డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో భారత్‌కు ఈ సిరీస్ కీలకం**



శ్రీలంకతో త్వరలో ప్రారంభం కానున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌కు ముందు భారత జట్టులో కీలక మార్పు చోటుచేసుకుంది. యువ బ్యాటర్ సాయి సుదర్శన్ గాయం కారణంగా సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. అతని స్థానంలో కుడిచేతి వాటం బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌ను బీసీసీఐ ఎంపిక చేసింది. కుడి కాలి వేలికి అయిన గాయం (రైట్ టో స్ట్రెస్ రియాక్షన్) కారణంగా సాయి సుదర్శన్ ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జూజు)లో చికిత్స పొందుతున్నాడు. అతను గాయం నుంచి గణనీయంగా కోలుకుంటున్నప్పటికీ, సిరీస్ నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించలేడని బీసీసీఐ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. వైద్య బృందం అతని పురోగతిని నిశితంగా పరిశీలిస్తోందని తెలిపింది. సాయి సుదర్శన్ స్థానంలో జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్, కొలంబోలో భారత జట్టుతో కలవనున్నాడు. పేస్, స్పిన్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోగల నైపుణ్యం ఉన్న సర్ఫరాజ్, ఇప్పటివరకు 6 టెస్టులు ఆడి 37.1 సగటుతో 371 పరుగులు చేశాడు. ఇందులో 150 పరుగుల అత్యధిక స్కోరు కూడా ఉంది. గతంలో ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీకి ఎంపికైనప్పటికీ, అతనికి తుది జట్టులో ఆడే అవకాశం రాలేదు.భారత్, శ్రీలంక మధ్య తొలి టెస్టు ఆగస్టు 15న గాలెలో ప్రారంభం కానుంది. రెండో టెస్టు ఆగస్టు 23 నుంచి 27 వరకు కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరుగుతుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) పాయింట్ల పట్టికలో ప్రస్తుతం భారత్ ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో ఉన్నాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌లో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేయడం అత్యంత కీలకం.

శ్రీలంకతో టెస్టులకు భారత జట్టు:

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్, దేవదత్ పడిక్కల్, సారాంశ్ జైన్, అకిబ్ నబీ, సర్ఫరాజ్ ఖాన్.

## సిరాజ్ సిక్సర్ల హ్యాట్రిక్.. వార్మప్ మ్యాచ్‌లో భారత్ థ్రిల్లింగ్ విక్టరీ



పేసర్ మహమ్మద్ సిరాజ్ బౌలర్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ విధ్వంసం సృష్టించాడు. ఆఖరి ఓవర్లో వరుసగా మూడు సిక్సర్లు బాది శ్రీలంక క్రికెట్ ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో భారత్‌కు 6 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయాన్ని అందించాడు. ఈ విజయంతో టెస్ట్ సిరీస్‌కు ముందు టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసుకుంది. ఆదివారం ముగిసిన ఈ మ్యాచ్‌లో 207 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, ఒక దశలో చివరి రెండు ఓవర్లలో 23 పరుగులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితిలో నిలిచింది. ఈ సమయంలో క్రీజులో ఉన్న సిరాజ్ తనలోని పవర్ హిట్టర్‌ను బయటకు తీశాడు. 44వ ఓవర్లో ఒక సిక్సర్ బాదిన అతను, ఆఖరి ఓవర్లో వరుసగా మూడు బంతులను స్టాండ్స్‌లోకి పంపి మరో మూడు బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించాడు. సిరాజ్ కేవలం 15 బంతుల్లోనే 32 పరుగులు చేసి అజేయంగా నిలవడం విశేషం.లక్ష్య ఛేదనలో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (61) అర్ధ శతకంతో రాణించి జట్టుకు గట్టి పునాది వేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్ అయిన జైస్వాల్, ఈసారి ఆత్మవిశ్వాసంతో ఆడి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. గాయం కారణంగా తొలి రెండు రోజులు ఆటకు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (44) తిరిగి బరిలోకి దిగి రాణించడం భారత్‌కు సానుకూలాంశం. అయితే, రిషభ్ పంత్ (28), ధ్రువ్ జురెల్ (12) తక్కువ స్కోర్లకే పరిమితమయ్యారు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (22) మరోసారి వేగంగా పరుగులు చేశాడు. అంతకుముందు, భారత బౌలర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించారు. యువ పేసర్ గుర్నూర్ బ్రార్ (2/38) తన బౌన్స్‌తో ఆకట్టుకోగా, రవీంద్ర జడేజా (2/33) రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ తలో వికెట్ తీశారు. శ్రీలంక ఎలెవన్ జట్టులో నిషాన్ మధుష్క (63) మరోసారి అర్ధ శతకంతో రాణించగా, ఆ జట్టు 200/6 వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

స్కోర్లు:

శ్రీలంక క్రికెట్ ఎ మొదటి ఇన్నింగ్స్: 363/8 డిక్లేర్డ్ ఛ రెండో ఇన్నింగ్స్: 200/6 డిక్లేర్డ్ (నిషాన్ మధుష్క 63, నిపున్ ధనంజయ 46; రవీంద్ర జడేజా 2–33, గుర్నూర్ బ్రార్ 2–37)

భారత్ మొదటి ఇన్నింగ్స్: 357/6 డిక్లేర్డ్ ఛ రెండో ఇన్నింగ్స్: 214/4 (45 ఓవర్లలో) (యశస్వి జైస్వాల్ 61, శుభ్‌మన్ గిల్ 44; కేశర సువంత 2–57, విశ్వ ఫెర్నాండో 1–34)మొత్తంగా ఈ వార్మప్ మ్యాచ్ భారత జట్టుకు మంచి ప్రాక్టీస్‌ను అందించింది. కీలక బ్యాటర్లు ఫామ్ అందుకోవడం, బౌలర్లు లయ సాధించడంతో జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉంది. ఇరు జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా తొలి టెస్ట్ ఆగస్టు 15న గాలె వేదికగా ప్రారంభం కానుంది.

## ఆ కుర్రాడి వయసెంతన్నది అనవసరం.. భారత క్రికెట్‌కు దొరికిన ఆణిముత్యం: బ్రెట్

భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై ఆస్ట్రేలియా మాజీ దిగ్గజ పేసర్ బ్రెట్ లీ ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ వయసు చుట్టూ జరుగుతున్న చర్చ అనవసరమని, అతనిలో అపారమైన ప్రతిభ ఉందని, భారత క్రికెట్‌కు సుదీర్ఘకాలం సేవలు అందించగలడని అభిప్రాయపడ్డాడు. ఇటీవలే 'బీర్ బైసెప్స్' అనే యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ బ్రెట్ లీ ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు."భారత్ బయట, ప్రపంచవ్యాప్తంగా అందరూ వైభవ్ వయసు నిజంగా 15 ఏళ్లేనా? అని చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం ఇదే అతిపెద్ద టాకింగ్ పాయింట్. కానీ, అతడి వయసు ఎంతైతే నాకేంటి? 15 అయినా, 17 లేదా 18 అయినా పర్వాలేదు. ఈ కుర్రాడు అద్భుతంగా క్రికెట్ ఆడగలడు. భారత క్రికెట్‌కు దొరికిన గొప్ప ఆటగాడు. భవిష్యత్తులో అతను మరెన్నో గొప్ప విజయాలు సాధించబోతున్నాడు" అని బ్రెట్ లీ పేర్కొన్నాడు.ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ తన భయంలేని ఆటతీరుతో అందరి దృష్టిని ఆకర్షించాడు. బౌలర్ల పేరు, ప్రతిష్ఠలతో సంబంధం లేకుండా తనదైన శైలిలో భారీ షాట్లతో చెలరేగాడు. అతని అసాధారణమైన బ్యాట్ స్పీడ్, దూకుడైన బ్యాటింగ్ అతన్ని టోర్నమెంట్‌లోని యువ స్టార్లలో ఒకడిగా నిలబెట్టాయి. ఐపీఎల్‌లో కనబరిచిన ఈ అద్భుత ప్రదర్శనతోనే, అతనికి భారత టీ20 జట్టు నుంచి పిలుపు వచ్చింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో పెద్దగా రాణించకపోయినా, జింబాబ్వే పర్యటనలో అద్భుతంగా పుంజుకుని 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఇది ఎటువంటి ఒత్తిడిలోనైనా రాణించగల అతని సామర్థ్యాన్ని తెలియజేసింది.వైభవ్ బ్యాటింగ్‌లోని పరిణతిని బ్రెట్ లీ ప్రత్యేకంగా ప్రశంసించాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో అతను చేసిన 97 పరుగుల ఇన్నింగ్స్‌ను గుర్తుచేసుకున్నాడు. "ఆ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లు నిప్పులు చెరిగే బంతులు వేస్తుంటే, వైభవ్ ఏమాత్రం భయపడకుండా తన ముక్కు మీదుగా హుక్ షాట్లు ఆడాడు" అని కొనియాడాడు. అయితే, ఇంత చిన్న వయసులో అనూహ్యంగా వచ్చిన పేరు ప్రఖ్యాతులు, అంచనాలను తట్టుకుని నిలబడటమే అతడి ముందున్న అతిపెద్ద సవాల్ అని బ్రెట్ లీ అభిప్రాయపడ్డాడు.



# యువతకు రోల్ మోడల్ అంటే అతడే: వీవీఎస్ లక్ష్మణ్

**విరాట్ కోహ్లీ యువతకు ఆదర్శప్రాయుడన్న వీవీఎస్ లక్ష్మణ్**

**అతనిలా ఎదిగేందుకు చాలామంది క్రికెటర్లు ప్రయత్నిస్తున్నారని వెల్లడి**

**ఆటగాళ్ల గాయాల విషయంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను తప్పుబట్టొద్దని సూచన**

**స్పోర్ట్స్ సైన్స్ హెడ్ నియామకంలో ఇబ్బందులున్నాయని అంగీకారం**

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఒక అద్భుతమైన ప్రొఫెషనల్ క్రీడాకారుడు అని, యువ క్రికెటర్లకు గొప్ప ఆదర్శప్రాయుడని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రశంసల వర్షం కురిపించాడు. కోహ్లీ తన కోసం తాను నిర్దేశించుకున్న అత్యున్నత ప్రమాణాలను అందుకునేందుకు నిరంతరం కష్టపడతాడని, అతని అంకితభావం ఎందరికో స్ఫూర్తినిస్తోందని లక్ష్మణ్ పేర్కొన్నాడు. చాలా మంది యువ ఆటగాళ్లు కోహ్లీని అనుసరించాలని అనుకుంటున్నారని, అతనిలా రాణించాలని కోరుకుంటున్నారని వివరించాడు. ఇదే సమయంలో, ఇటీవలి కాలంలో భారత ఆటగాళ్లు వరుసగా గాయాల బారిన పడటంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌పై వస్తున్న విమర్శలపైనా లక్ష్మణ్ స్పందించాడు. జస్‌ప్రీత్ బుమ్రా, సాయి సుదర్శన్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్ వంటి కీలక ఆటగాళ్లు గాయపడటంపై మాట్లాడుతూ, గాయాలు క్రికెటర్ల కెరీర్‌లో ఒక భాగమని, వాటిని పూర్తిగా నివారించలేమని స్పష్టం చేశాడు. ఈ విషయంలో సీఓఈని నిందించడం సరికాదని, ఆటగాళ్ల పనిభారాన్ని జాగ్రత్తగా పర్యవేక్షించడం, సరైన నిర్వహణపై దృష్టి పెట్టడం ముఖ్యమని తెలిపాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కేవలం గాయపడిన ఆటగాళ్లకు పునరావాసం కల్పించే కేంద్రం మాత్రమే కాదని, దాని పాత్ర అంతకంటే చాలా విస్తృతమైనదని లక్ష్మణ్ నొక్కి చెప్పాడు. ఆటగాళ్ల నైపుణ్యాలను మెరుగుపరచడం, వారు అత్యుత్తమ ప్రదర్శన చేసేందుకు అవసరమైన అన్ని వనరులను అందించడమే సీఓఈ ప్రధాన లక్ష్యమని వివరించాడు. సీఓఈలో కీలకమైన హెడ్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్ పదవి ఖాళీగా ఉండటంపై కూడా లక్ష్మణ్ మాట్లాడాడు. గతంలో ఈ బాధ్యతలు నిర్వర్తించిన నితిన్ పటేల్ వైదొలిగిన తర్వాత, ఆ స్థానానికి సరైన అభ్యర్థి కోసం వెతుకుతున్నామని అంగీకరించాడు. ఈ పదవి కోసం ఆండ్రూ లీపస్‌ను నియమించాలని భావించినప్పటికీ, కుటుంబ కారణాల వల్ల అది సాధ్యపడలేదని తెలిపాడు. ఈ పాత్రకు విశేషమైన అనుభవం, భారత క్రికెటర్ల అవసరాలపై లోతైన అవగాహన ఉన్న వ్యక్తి అవసరమని లక్ష్మణ్ అభిప్రాయపడ్డాడు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## బర్త్ డే నాడు మహేశ్ బాబు డబుల్ ట్రీట్.. కుటుంబం విషెస్, సినిమా అప్‌డేట్



సూపర్‌స్టార్ మహేశ్ బాబు నేడు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానులకు డబుల్ ట్రీట్ లభించింది. ఒకవైపు కుటుంబ సభ్యులు సోషల్ మీడియా వేదికగా ప్రేమపూర్వక శుభాకాంక్షలు తెలుపగా, మరోవైపు మహేశ్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి' నుంచి ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ చిత్రంలో మహేశ్ 'రుద్ర' అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు.మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన భార్య నమ్రత శిరోద్కర్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక అందమైన ఫ్యామిలీ ఫొటోను పంచుకున్నారు. మహేశ్, పిల్లలు గౌతమ్, సితారలతో కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేస్తూ, "హ్యాపీ బర్త్ డే వీదీ! ప్రతి రోజును ప్రత్యేకంగా మార్చినందుకు ధన్యవాదాలు. ఈ ఏడాది నీకు ప్రేమ, ఆరోగ్యం, అనంతమైన సంతోషం లభించాలని కోరుకుంటున్నాను. నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాం" అని రాసుకొచ్చారు. కుమార్తె సితార కూడా తండ్రికి ముద్దు పెడుతున్న ఫొటోను షేర్ చేస్తూ, "హ్యాపీ బర్త్ డే నాన్న. ఎప్పటికీ నా ఫేవరెట్ పర్సన్ మీరే" అని తన ప్రేమను వ్యక్తపరిచింది.మరోవైపు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'వారణాసి' చిత్రం నుంచి మేకర్స్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. వెదురు తెప్పపై ప్రశాంతంగా కూర్చున్న మహేశ్, మరో పోస్టర్‌లో అడవి మధ్యలో ప్రకృతిని చూస్తూ నిల్చున్న లుక్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. "రుద్ర అంటే కేవలం భయంకరమైనవాడు మాత్రమే కాదు" అనే క్యాప్షన్‌తో ఈ లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి 'రుద్ర' పాత్ర గురించి ఒక సుదీర్ఘమైన, ఆసక్తికరమైన నోట్‌ను పంచుకున్నారు. "రుద్ర ఒక గొప్ప ఉద్దేశ్యాన్ని నెరవేర్చడానికి పుట్టాడు. తను అడగని ఒక విధిని మోస్తున్నాడు. అతను చమత్కారి, సున్నితమైనవాడు, అదే సమయంలో భయంకరమైనవాడు. మహేష్ ఆ పాత్రకు ప్రాణం పోశాడు. భయంకరంగా ఎవరైనా నటించగలరు, కానీ భయంకరంగా, సున్నితంగా ఒకేసారి నటించడం చాలా కొద్దిమందికే సాధ్యం" అని రాజమౌళి పేర్కొన్నారు. ఆఫ్రికా షెడ్యూల్ అనుభవాలను వివరిస్తూ.. "ఈ ఫ్రేమ్స్ ఆఫ్రికా షెడ్యూల్‌లోనివి. కిలిమంజారో, మసాయ్ మారా ప్రాంతాల్లో షూటింగ్ చేస్తున్నప్పుడు నేను ఆశ్చర్యపోయాను. అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని 1.43:1 ఐమాక్స్ ఫ్రేమ్‌లో కూడా బంధించలేమని కొన్ని ఉదయాలు అనిపించింది" అని రాజమౌళి తెలిపారు. మొత్తంగా పుట్టినరోజున ఫ్యామిలీ విషెస్‌తో పాటు సినిమా అప్‌డేట్ రావడంతో మహేశ్ అభిమానులు పండగ చేసుకుంటున్నారు.

## 'ఐదేళ్ల పోరాటం తర్వాత.. ఈ రోజు కథ మారింది'.. వరుణ్ విజయంపై నాగబాబు ఎమోషనల్ పోస్ట్!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సుదీర్ఘకాలం తర్వాత బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేశారు. ఆయన హీరోగా, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన హారర్-కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు' థియేటర్లలో ఘన విజయం సాధించింది. తొలి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ.10.2 కోట్లకు పైగా వసూళ్లు సాధించి, వరుణ్ తేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనర్‌గా నిలిచింది. ఈ బ్లాక్‌బస్టర్ విజయంపై ఆయన తండ్రి, నటుడు నాగబాబు సోషల్ మీడియా వేదికగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు."గత ఐదేళ్లుగా అన్నీ చూస్తూనే ఉన్నాను. నా కొడుకు ఆ నిశ్శబ్దాన్ని, బాధను, నిరాశను తనలోనే మోశాడు. అయినా ప్రయత్నాన్ని ఎప్పుడూ ఆపలేదు. తన పేరు మీద హిట్లు లేవు, కేవలం వైఫల్యాలు మాత్రమే తనని పరీక్షిస్తూ వచ్చాయి. అది తనని ఎంతగా బాధపెట్టిందో నాకు తెలుసు, కానీ ఆ బాధను ఎప్పుడూ బయటకు చెప్పలేదు" అంటూ నాగబాబు తన మనసులోని మాటలను పంచుకున్నారు. తామిద్దరం మౌనంగానే ఒకరినొకరు ఓదార్చుకునేవాళ్లమని, మాటల్లో చెప్పకుండానే ఒకరి భావాలను మరొకరు అర్థం చేసుకునేవాళ్లమని ఆయన గుర్తుచేసుకున్నారు."ఐదేళ్ల పోరాటం తర్వాత.. ఈ రోజు కథ మారింది. ఒక బ్లాక్‌బస్టర్ విజయం దక్కింది. అయితే ఈ విజయం పూర్తిగా వాడిదే. వాడి పోరాటం, వాడి సహనం, వాడి కష్టం. నేను వాడి కెరీర్‌లో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు, ఏ క్రెడిట్ తీసుకోలేదు. నిన్నటి వైఫల్యాలు ఎలాగో తనవేనో, ఈ రోజు ఈ విజయం కూడా పూర్తిగా తనదే" అంటూ తండ్రిగా తనకెంతో గర్వంగా ఉందని నాగబాబు పేర్కొన్నారు."కంగ్రాట్స్ బంగారు.. నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది" అంటూ వరుణ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఈ విజయానికి కారణమైన దర్శకుడు మేర్లపాక గాంధీ, నటుడు సత్య, నటి రితికా నాయక్, నిర్మాత రాజీవ్, సంగీత దర్శకుడు తమన్‌తో పాటు చిత్ర బృందం మొత్తానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కథను నమ్మి, అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని కొనియాడారు.





## ఆ ప్రాబ్లమ్ వల్లే ప్రమోషన్స్‌కి రాను.. కానీ యశ్ కోసమే నా నియమం బ్రేక్ చేశా: నయనతార

దక్షిణాది చిత్ర పరిశ్రమలో లేడీ సూపర్‌స్టార్‌గా తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న నయనతార, తన సినిమాల ప్రమోషన్లకు దూరంగా ఉంటారనే విషయం అందరికీ తెలిసిందే. ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, ఇంటర్వ్యూలకు ఆమె హాజరుకావడం చాలా అరుదు. అయితే, తన ఈ నియమాన్ని పక్కనపెట్టి, నిన్న జరిగిన 'టాక్సిక్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ఆమె హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. తాను ఎందుకు వచ్చానో కూడా ఈ వేదికపై ఆమె స్వయంగా వెల్లడించారు.ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ.. "నేను ప్రమోషనల్ ఈవెంట్లకు హాజరుకాకూడదని కాదు. నాకు ఆ పని సరిగ్గా చేతకాదు. అందుకే వాటికి దూరంగా ఉంటాను. కానీ, ఈ కార్యక్రమానికి రావడానికి హీరో యశ్ ఒక్కరే కారణం. ఆయన ఒక్క ఫోన్ కాల్ చేశారు, ఈ ఈవెంట్‌కు రావడానికి నాకు అది చాలు" అని తెలిపారు. కేవలం యశ్ కోసమే తాను ఈ కార్యక్రమానికి వచ్చానని స్పష్టం చేశారు.యశ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి చెబుతూ.. "చాలా మంది పెద్ద స్టార్స్ ఉంటారు. కానీ, యశ్‌ను మొదటిసారి కలిసినప్పుడు, తెరపై ఆయనకున్న లార్జర్-దెన్-లైఫ్ ఇమేజ్ నిజ జీవితంలో కూడా కనిపించింది. ఆయన వ్యక్తిత్వం కూడా అంతే గొప్పది" అని ప్రశంసించారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన 'టాక్సిక్' చిత్రంలో యశ్, నయనతారతో పాటు కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి కీలక పాత్రల్లో నటించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇంగ్లీష్, కన్నడ భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ సినిమాను తెలుగు, తమిళం, హిందీ, మలయాళంలో డబ్ చేసి రిలీజ్ చేయనున్నారు.





## గౌరీ హెగ్డేగా టబు.. 'స్లమ్ డాగ్' నుంచి స్పెషల్ గ్లింప్స్

డైనమిక్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తనదైన శైలిలో మరో కొత్త సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. విజయ్ సేతుపతి హీరోగా 'స్లమ్ డాగ్ - 33 టెంపుల్ రోడ్' అనే ఆసక్తికరమైన టైటిల్‌తో ఓ ఇంట్రెస్టింగ్ మూవీని తెరకెక్కిస్తున్నారు. పాన్-ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నుంచి తాజాగా ఒక కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో సీనియర్ నటి టబు ఒక శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నట్టు ప్రకటించింది.ఈ సినిమాలో టబు 'గౌరీ హెగ్డే' అనే పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్రకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తూ, "ఆమెతో పెట్టుకోవడానికి సాహసించవద్దు" (ాష్ట్రవ'ం అశ్ ్ట్రవ శీఅవ ఎశీబ ఝతీవ్ శీ ఎవంం షఠ్ట్ర) అనే క్యాప్షన్‌ను జోడించారు. దీన్ని బట్టి సినిమాలో ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉండనుందో అర్థం చేసుకోవచ్చు. గౌరీ హెగ్డే పాత్రకు సంబంధించిన ఒక స్పెషల్ క్యారెక్టర్ గ్లింప్స్‌ను రేపు (ఆగస్టు 10) ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్, జేబీ మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జేబీ నారాయణ రావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. విజయ్ సేతుపతి సరసన సంయుక్త మీనన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, విష్ణు రెడ్డి తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న ఈ సినిమాపై పూరి, విజయ్ సేతుపతి, టబు కాంబినేషన్ కారణంగా భారీ అంచనాలు నెలకొన్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com